# పాప

★

**"వాచస్పతి"**

అలసిపోయిన సూర్యుడు విశ్రాంతికోసం మేఘాలను గుంచిస్తున్న కొండల క్రీనీడల్లోకి ఆయాసంగా అడుగులేస్తున్నాడు. ఆహార సంపాదనకు వెళ్లిన పక్షులు — ఎక్కడో అరుస్తున్న పిల్లలకు జవాబిస్తూ త్వరత్వరగా గూళ్ళవైపు ఎగిరిపోతున్నాయి. రోడ్లమీద జనసమ్మర్దం క్రిక్కిరిసింది ఎవరి ముఖంలో చూసినా ఆత్రుత, గాబరా! పరిగెస్తున్నారు. ఎక్కడికో? ఎందుకో మరి! వీళ్లలోపాటే బస్సులూ, కార్లూ, రిక్షాలూ పరిగెడుతున్నాయి — వీళ్ల హృదయాలకు ప్రతిబింబంగా — వీళ్ల ఆత్రుతకు క్రీనీడగా! ఎదురుగా ఏముందో, ప్రక్కలేం జరుగుతుందో తెలిసికోకుండా వీళ్ళ పరిగెత్తడం చూస్తే పరుగు పందెంగానీ వుందేమోననిపించింది! అంగలేసుకుంటూ వెళ్తున్న ఓ పెద్దమనిషినాపి ''ఎందుకిలా పరుగెడుతున్నారు?'' అన్నాను. అతను చిత్రంగా నావైపు చూచి — అంగలేసుకుంటూ వెళ్లిపోయాడు! ఆశ్చర్యంతో ఓ ఐదు నిముషాలు పేవ్‌మెంటుమీద నిలబడి — అడుగులో అడుగేస్తూ మెల్లగా కదిలిపోయాను.

రోడ్డుమీదున్న ఎలక్ట్రిక్ లైట్లన్నీ ఒక్కసారిగా నన్నుచూసి నవ్వాయి. నేనూ నవ్వుతోనే పలకరించి పార్కువైపుగా నడిచాను. పరిచయమున్న ముఖం ఒక్కటీ కనిపించలేదు. క్రోటను చెట్టుకింద కూర్చుని కళ్ళు మూసుకున్నాను. తల తిరిగిపోతుంది. మనుషులు పరిగెడుతున్నారు — అరుస్తున్నారు — నవ్వుతున్నారు కొంతమంది పరిగెత్తలేక కూర్చున్నారు. కూర్చున్నవాళ్లను చూసి పరిగెత్తేవాళ్ళు నవ్వుతున్నారు. పరిగెత్తలేక కూర్చున్నవాళ్ళు — జాలిగా దీనంగా ముఖం పెట్టారు. హృదయ విదారకంగ వున్న ఆదృశ్యాన్ని చూశాక కళ్ళు తెరిచాను. హృదయం అథోలోకాలకు కృంగి పోతున్నట్లనిపించింది.

జీవితంలో ఏరోజూ కలగనంతటి నిరాశానిలం హృదయాన్ని కాల్చివేసింది.

ఎందుకు? ఎందుకీ హృదయం యిలా కాలిపోతుంది?

కారణంకోసం తడివి చూసాను. ప్రతి రక్తపు బొట్టును.

ప్రతి రక్తపు బొట్టూ — ప్రతి జీవాణువూ గొంతు చించుకుని ''పరిగెత్తు — పరిగెత్తు'' అని అరుస్తున్నాయి.

ఆ అరుపులు హృదయంలో ప్రతిధ్వనించి హృదయాన్ని నానా భీభత్సంగా తయారుచేసాయి.

పరుగెత్తలేను.

పరుగెత్తలేను.

పరుగెత్తను.

అన్నాను కచ్చితంగా.

'నువ్వు' రాకుంటే వుండు నే పోతానని పరిగెత్తి పోతున్న హృదయాన్ని ఆపి త్రాటితోకట్టి క్రోటనుచెట్టు గాఢాలింగనాన్ని వదల్చుకొని లేచి నిలబడ్డాను.

హృదయం చిరగబడింది.

పోరాటంలో కూరి వ్రయ్యలైంది.

మళ్లీ అతికించాలి — అతికించాలి.

ఎలాగ? ఎలా?

ఓ చల్లని చూపు — ఓ చల్లని మాట ''పరుగెత్తకున్నా పర్వాలేదు. నడచివెళ్లినా గమ్యస్థానం చేరుకోగలవు' అని —

— ఓ మాట —

— ఓ చూపు —

అథో లోకాలకు కృంగిపోతున్న యీ హృదయాన్ని నిలద్రొక్కేందుకు —

వ్రయ్యలైన యీ హృదయం అతుక్కునేటట్లు — కావాలి — యీ క్షణమే కావాలి.

మోడుబారిన చెట్టులా వుంది జీవితం. స్నేహితులున్నారు. కానీ మనసిచ్చి పుచ్చుకొనే స్నేహితులు లేరు.

ఒక ప్రాణ స్నేహితుణ్ణి సంపాదించుకోవడం ఎంత కష్టమో యిప్పుడు తెలుస్తోంది. సందులూ గొందులూ దాటి పోతున్నాను. చటుక్కున రాజశేఖరం గుర్తుకొచ్చాడు. కాళ్ళు మెల్లమెల్లగా అటు నడిచాయి.

చుట్టూ పదిమంది పిల్లల్ని పెట్టుకుని ట్యూషను చెప్తున్నాడు.

''కూర్చోరా!'' కుర్చీ చూపించాడు చిరునవ్వుతో. కుర్చీలో కూర్చుని బరువుగా వూపిరి తీశాను.

''అలా పార్కుదాకా పోదాం రా!''

''వీళ్లకు ట్యూషను పూర్తయ్యేసరికి ఎనిమిదవుతుంది.''

''పోనీ — తర్వాత'' ఆశగా చూసాను వాడి కళ్లల్లోకి.

''సారీ! తర్వాత భోంచేసేసరికి కాలేజీ టైమవుతుంది.''

''కాలేజా!''

'ఎమ్. ఎ. కు పోతున్నానని నీతో చెప్పానుగా. నైట్ కాలేజీకి అటెండవుతున్నాను.''

విశ్రాంతి తీసుకోనుగూడా భయపడి పరిగెత్తి పోతున్న రాజశేఖరాన్ని చూచి వ్రయ్యలైన హృదయం విలవిల్లాడింది.

''వెళ్తాను'' లేచాను.

''కాఫీ తీసుకుని వెళ్దువుగాన్లే! కూర్చో!''

కాఫీ కొచ్చినట్లు!

ఎవ్వరూ నన్నర్థం చేసుకోరేం?

హృదయం యింకా —యింకా అధోలోకానికి కృంగిపోతుంది.

వాడేదో అంటున్నాడు. విన్పించుకోకుండా వచ్చేసాను.

ఇంటికొచ్చి కుళ్లి మంచంలో వాలిపోయాను. చీలి వ్రయ్యలైన హృదయంలోనుండి రక్తధారలు స్రవిస్తున్నాయి.

కాలి మండిపోతున్న కళ్లల్లో నుండి బాష్పకణాలు రాలిపడ్తున్నాయి.

చల్లని మృదువైన స్పర్శ నుదురు మీద కలిగింది.

కళ్ళు తెరచి కన్నీళ్ళు తుడుచుకొని చుట్టూ కలయ చూసాను.

పాలరాతితో మలచిన బొమ్మలాగ— సంవత్సరం దాటీ దాటని ముద్దులు మూట కట్టే చిన్నారి పాప! నాకళ్ళను నమ్మలేక కళ్ళు నులుముకుని చూసాను. ఎవరీ పాప? ఎలా వచ్చింది?

భగవత్ స్వరూపమా ?

ప్రకృతికి ప్రతిబింబమా ?

తెలుపూ—పసుపూ కలిపిన రంగు, గుండ్రని ముఖం ఎత్తయిన సన్నని ముక్కు—చల్లని విశాలమైన కళ్ళు—సన్నని ఎర్రని పెదిమలు.

ఏ అదృష్టశాలి యీ అందాల రాశిని నవమాసాలు మోసింది ?

ఏ పుణ్యశాలి యీ ముగ్ధ మోహన రూపాన్ని పెంచి పెద్ద చేస్తుంది?

మంచం మీద నుండి లేచి పాపను హృదయానికి హత్తుకున్నాను.

చిగురుల్లాంటి పాప చేతులు ముఖాన్నంతా మృదువుగా తడిమాయి.

నిర్మలంగా వున్న పాప చేతులు కన్నీటి మరకలచే మలినమయ్యాయి.

''ఎవరి పాపవమ్మా? ఎవరు పాపవు తల్లీ !'

పాప కన్నుల్లో నాప్రతిబింబాన్ని చూసుకుంటూ ఎండి పోయిన పెదవులను తడువు కుంటూ అడిగాను.

పాప కన్నుల్లో పెదిమలపై నాట్యమాడే నవ్వు ''నీపాపనే!'' అన్నాయి.

పాప నవ్వుల భాషను అర్థం చేసుకొన్నాను.

వ్రయ్యలైన హృదయానికి పాపను దగ్గరగా చేర్చు కొన్నాను.

''అన్నానికి,రా!'' అంది అమ్మ.

''ఎవరి పాపమ్మా?''

''మన పాపే!'' అమ్మ నవ్వింది.

''చెప్పమ్మా! ''

''ప్రక్కవాటాలో క్రొత్తగా యీరోజే చేరారు. వాళ్ళపాప. వాళ్ళకు తెలీకుండా వరండాలో నుండి వచ్చినట్లుంది. ఇలా యివ్వరా! యిచ్చొస్తాను'' అమ్మ చేతులు చాపింది.

''కాసేపుండనీవమ్మా ! యిక్కడుందని చెప్పు''

అమ్మ వెళ్ళి పోయింది.

పాప నాతో ఆడుకుని ఆడుకుని అలసి ఒళ్ళు



# హేమంత తుషారం

వై. సావిత్రి.

నిద్ర పోయింది. పాపను తీసికెళ్ళేందుకు వాళ్ళమ్మ వచ్చింది.

"వుంచండి" పాప నివ్వడం యిష్టం లేక అన్నాను.

"అయ్యో! రాత్రంతా మీ ప్రాణం తోడేస్తుంది!"

"పర్వాలేదు! వుంచండి!"

"వుదయమే తెచ్చు కుందురుగాని"

పాపను తీసుకొని వెళ్ళి పోయింది.

పాప మెత్తని చేతులనూ— మెత్తని హృదయాన్నీ తలచుకుంటూ హాయిగా నిద్రపోయాను. మరునాడు సాయంత్రం పాపనుతీసుకొనిపార్కుకు పోతానన్నాను.

"మిమ్మల్నక్కడ కూర్చో నీదు"

"పర్వాలేదు"

ఆమె నవ్వి పాపను నాచేతుల్లో పెట్టింది.

"జాగ్రత్తండీ! అటూ యిటూ వెళ్తుంది.

"ప్రాణం పోగొట్టుకుంటానా ?"

ఆమె ఆశ్చర్యంతో అలాగే నిలబడింది.

నిన్నటి క్రోటను చెట్టు క్రింద యిద్దరం కూర్చున్నాము. .

క్రోటను ఆకులు రెండు కోసి పాప చేతికిచ్చాను.

ఇసకలో కాసేపు ఆడుకుంది.

కాసేపు నాతో మాట్లాడింది.

వ్రేలు పట్టుకుని నడవబోయి రెండు సార్లు పడింది.

"యీ రోజుకు చాలు తల్లీ! రేపు"పాపను తీసుకు యింటికొచ్చేసాను.

దగ్గర దగ్గర పగలంతా నేనూ, పాపా ఆడుకుంటూ వుండే వాళ్ళం. సాయంకాలం తప్పకుండా పార్కుకెళ్ళి క్రోటను చెట్టునుకలుసుకొని హుట్టాడి — ఆటలాడుకొని వచ్చేవాళ్ళం.

ఓ సంవత్సరం గడిచి పోయింది.

పాప పడకుండా నడవడం నేర్చుకొంది.

పార్కులోకెళ్ళగనే—నాభుజం మీదనుండి దిగి వ్రేలు పట్టుకునేది.

ఇద్దరం మెల్లగా పార్కంతా చుట్టే వాళ్ళం.

పాపనవ్వేది మాట్లాడేది.

పాప మాటలకన్నా నవ్వే నాకు బాగా అర్ధమయ్యేది.

మరో సంవత్సరం గడిచింది—

పార్కులో దించగనే పరుగులు తీసేది పాప.

కాస్త దూరం పరిగెత్తి వెనక్కు తిరిగి నన్ను చూసి నవ్వేది.

"దా! దా!

"వస్తున్నా! తల్లీ !"

కాసేపు నాతో నడిచేది. కాసేపు పరుగులు తీసేది.

ఒకసారి పరిగెడ్తూ పరిగెడ్తూ పడింది..

లేవదీసి ఒళ్ళు కూర్చో బెట్టుకున్నాను.

"ఎందుకు తల్లీ ! పరిగెత్తేది? నాతో నడువమ్మా!"

అర్ధం చేసుకున్నట్లు తలూపింది పాప.

మరో సంవత్సరం గడిచింది. పాప యిప్పుడు నాకు నడక నేర్పుతుంది. మాటలు నేర్పుతుంది.

"నా దగ్గర మాటలు నేర్చుకున్నావు !నాకే మాటలు నేర్పుతావా? ఎంత జాణవయ్యావే తల్లీ!

కిలకిలా నవ్వి ఎదపై వాలేది పాప.

ఇప్పుడు పాప యింటి దగ్గర నుండి పార్కు దాకా నడుస్తుంది. దారంతా చిలక మాట్లాడినట్లు మాట్లాడ్తూనే వుంటుంది.

"మీ అమ్మ నీకు వస ఎక్కువ పోసినట్లుంది" అంటే చప్పట్లు కొట్టి నవ్వేది పాప.

పాపకు ఐదు సంవత్సరాలు నిండాయి.

ఎప్పుడూ నాతో ఆడుకునే పాప యిప్పుడు బడికిపోతుంది.

బిక్కు బిక్కు మంటూ ఐదు గంటల వరకూ పాపకోసం ఎదురు చూసే వాణ్ణి.

స్కూలు నుండి రాగానే పాప నాదగ్గరకు పరిగెత్తేది.

ఓరోజున పరుగెత్తికొచ్చి నావళ్ళోవ్రాలింది.

"అన్నయ్యా! యీరోజేం నాలెక్క రైటు"

ప్రపంచాన్ని జయించినంత గొప్పగా ముఖం పెట్టింది పాప.

"అలాగేం తల్లీ! నీలెక్కెప్పుడూ తప్పుపోదమ్మా! పాపను హృదయానికి హత్తుకుని ముద్దుపెట్టుకున్నాను. ఉన్నట్టుండి

"యీరోజు పాల్కుకొద్దన్నయ్యా!" అంది.

"ఏం తల్లీ!"

"లెక్కలు చెప్పవూ?"

"మళ్ళీ వచ్చి చేసుకుందామమ్మా!"

"గునింతం?"

"పొద్దున"

"బడికెళ్ళొద్దూ?"

"వెళ్దువుగాన్లే తల్లీ!"

''ఉహూ!'' పాప తల అడ్డంగా తిప్పింది. ప్రేమగా యిన్ని రోజులు పెంచిన స్నేహలతను ఎవరో బలవంతంగా పెరికినట్లయింది.

''పాపా!''

''నాకళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఇన్నిరోజులుగ నన్నర్థం చేసుకున్న పాప యీ రోజు అర్థంకాని దృక్కులతో చూసింది.

ఆనల్లని విశాలమైన కళ్ళల్లో పూర్వమున్న మృదుత్వం లేదనిపిస్తోంది.

ఇప్పుడా స్థలాన్ని ఆలోచనలు దోచుకున్నాయి.

పెదవుల మీద ఎప్పుడూ తొణికిసలాడే చిరునవ్వు క్రమ క్రమంగా మాయమవుతుంది.

''అయితే పార్కుకురావా తల్లీ!ఆడుకోవద్దూ''

పాప కళ్ళల్లోకి చూస్తూ బాధగా అన్నాను. పాప కళ్ళు దీర్ఘంగా ఆలోచిస్తున్నాయి.

''రామ్మా! రావూ?'' చేతులు చాపి జాలిగా పిలిచాను.

అయిష్టంగా నాచేతుల్లోకి వచ్చింది పాప. పార్కులో కూర్చున్నా పాప మునుపటిలా లేదు.

పాపలో పూర్తిగా మార్పొచ్చింది. ''అన్నయ్యా 'అ ఆ' లు రాయనా?'' నాగడ్డాన్ని తన చిట్టి చేతుల్తో ఎత్తిపట్టుకుని నాకళ్ళల్లోకి చూస్తూ అంది పాప.

''యింటికి పోయాక రాస్తువుగానీ'' చిరిచికి పుల్ల ఆడుకుందామా?''

పాప కోపంతో క్రోటను చెట్టు అవతలికెళ్ళి కూర్చుంది.

నామనసు ముక్కలయింది.

''అలాగే రాస్తువు గానీరా!'' బ్రతిమిలాడాను.

'అ ఆ' లన్నీ తప్పులేకుండా వరస క్రమంగా వ్రాసింది యిసకలో.

''రైట్! బాగా వ్రాసావమ్మా!''

పాపకళ్ళు గర్వంతో మెరిసాయి!

నాకళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

''పాట పాడనా అన్నయ్యా!''

''వూఁ........''

''ఐలే తాత మన బాపూజీ!'' పాటను తప్పులు తప్పులుగా పాడింది.

''ఎవరు చెప్పారీపాట?''

''టీచరు''

''బాగుంది''

మరొకసారి పాపకళ్ళు తళతళ లాడాయి. పాపకు ఎనిమిదేళ్ళు వచ్చాయి. ఫస్ట్‌ఫామ్‌లో చేరేందుకు తీరికలేకుండా చదువుతుంది. ఇప్పుడు పాపను చూడాలంటే స్కూలుకన్నా వెళ్ళాలి. లేకుంటే ట్యూషను మాస్టరింటికి అన్నా వెళ్ళాలి.

''అప్పుడే ఏం చదువులు? ఇప్పట్నుండే పాపకెందుకీ శ్రమ?వచ్చే సంవత్సరం చేర్పగూడదూ?' అంటే వాళ్ళమ్మ అదోరకంగా నవ్వింది—నన్నూ నామాటను లక్ష్య పెట్టకుండా.

తలొంచుకు వచ్చేసాను.

ఆరోజు మాస్టరింటికి గాబోలు—పరుగు లేస్తూ వెళ్తోంది.

పిల్చాను.

వచ్చింది.

''సాయంత్రం రామ్మా!పార్కుకు పోదామూ''

''మాస్టరు పంపరు''

ఇప్పుడు నామాటలు పాపకర్థం కావు. పాప మాటలు నాకర్థంకావు.

''ఎప్పుడూ చదువుతుంటావా?'' నా హృదయము మెలికలు తిరిగింది.

''ఆడుకుంటానన్నయ్యా!''

''ఎప్పుడు? ఎవర్తో?''

''సాయంకాలం''

''ఎవర్తో? ఎవర్తో?''

''నాగు, వరాలు, జయ........''

''చాలు. చాలు పాపా!'' పెద్దగా అరిచాను. తర్వాత నా అరుపుకు నేనే సిగ్గు పడ్డాను.

పాప చెప్పడం ఆపి పెద్ద పెద్ద కళ్ళతో నావైపు చూసింది.

''పార్కుకొచ్చి నాతో ఆడకోవడం యిష్టం లేదన్నమాట?''

''నీతోనా?''

''ఏం?''

''నాగు కొచ్చినన్ని ఆటలు నీకొచ్చా!''

''ఓ! యింకా ఎక్కువే వచ్చు!''

''అబ్బ!''

''అవును తల్లీ!''

''వరాలులా గుడిగుడి గుంజం చెప్తా?''

''ఓ!''

''జయలా పరెత్త గలవూ?''

''ఓ''

పాపచప్పట్లు కొట్టి పెద్దగా నవ్వింది.

''అన్నయ్యను గెలి చేస్తావా?''

''అయితే నాతో పరెత్తు చూద్దాం!''

పాపకు తెలుసు నేను పరిగెత్తలేనని!

''నీతోనా?''

''వూఁ'' పాపకళ్ళు నవ్వుతున్నాయి.

''ఉహూ'' తల అడ్డంగా తిప్పాను.

''అయితే మనిద్దరం ఎలా ఆడుకుంటాం?''

అవును. నిజమే!

ఇంకేం మాట్లాడలేక పోయాను.

పాపవైపు చూస్తూ నిలబడ్డాను.

పాపగూడా కాసేపు అలాగే నిలబడింది.

''అన్నయ్యా!''

''వూఁ......''

''దాన్నేమంటారు?'' అటునుంచి పారిపోతున్న పిల్లిని చూపుతూ అడిగింది పాప.

''పిల్లి!''

''కాదు''

''యింకేమంటారు?''

''క్యాట్''

''క్యాటా!''

పాప నవ్వింది.

ఆ నవ్వులో నాకు ధ్వనించిన లర్థాలు కోటానుకోట్లు!

ఆనవ్వుకు నాహృదయం చిల్లులు పడింది.

పాపలేచి సంచి తీసుకుంది.

''వెళ్తావా? పాపా?''

వెళ్తానన్నట్లుగా తలూపింది.

''సాయంకాలం రావూ?''

''రాను''

పిలుస్తున్నా వినిపించుకోకుండా పాప పరుగు తీసింది.

పాపవెంట పరుగెత్తలేక అక్కడే నిలబడ్డాను. కన్నీటిపొర చూపును కప్పేసేవరకూ అక్కడే నిలబడి—పాప కనిపించినంతవరకు చూసాను.

లేడిపిల్లలా చెంగు చెంగుమంటూ ఎగిరిపోయింది.

**అంతే! తర్వాతేం కన్పించలేదు.**

**ఇప్పటివరకూ నాదగ్గర నడక నేర్చుకున్న పాప ఇప్పుడు నాదగ్గరనుండి పారిపోయింది. నాదగ్గర మాటలు నేర్చుకున్న పాప—నా మాటల నర్థం చేసుకోలేక పోయింది!**

**ఇక నామాట లెవరికర్థమవుతాయి? పరిగెత్తలేని నామీద జాలి చూపేదెవరు? పరిగెత్తకున్నా నర్వాలేదని ఓదార్చేదెవరు? నడిచి గమ్యస్థానం చేరుకోగలవని హామీ యిచ్చేదెవరు?**

**స్తంభాన్నానుకుని—కళ్ళుతుడుచుకొని మరొకసారి పాపవెళ్ళిన దిక్కుగా చూసాను.**

**పాప కనిపించలేదు.**

**ఎప్పుడో పరుగుతీసి వుంటుంది!**

